# భక్తిలోనే సర్వసద్గుణములు ఇమిడియున్నవి

## సంతోషము తాత్కాలికము, ఆనందము శాశ్వతము

హృదయము ఆనందముతో కూడినటువంటిది. దేహభ్రాంతితో నీవు దానిని మూత వేస్తున్నావు. అప్పుడు నీకు ఆనందము కలిగించడంలేదు. ఒక చిన్న ఉదాహరణము. పగలంతాకూడను సూర్యుని వెలుతురు ఉంటున్నాది కనుక బల్బు స్విచ్ వేయటంలేదు. కాని, కరెంటు ఉంటున్నాది. రాత్రి చీకటి కాగానే బల్బు స్విచ్ వేసేటప్పటికి లైటు వచ్చింది. బల్బువుంది, కరెంటువుంది, స్విచ్ వేయకపోవటంచేత లైటు రాలేదు. స్విచ్ వేయనంతమాత్రమున కరెంటు లేదనడానికి వీలులేదు. అదే విధముగా నీవు ప్రపంచవాంఛలతో వుండినపుడు దైవవాంఛ అనే స్విచ్ ఆఫ్ చేస్తున్నావు. కష్టములు, నష్టములు అనే చీకటి ఆవరించినప్పుడు 'దేవుడా!' అని స్విచ్ వేస్తున్నావు. కాబట్టి, కరెంటు మాదిరి ఆనందము ఎల్లప్పుడు వుంది. కాని, నీవు దానిని అనుభవించడానికి ప్రయత్నించడంలేదు. ఒక చిన్న ఉదాహరణము. నీకు ఆకలి కలుగుతున్నది. రెండు చపాతీలు తింటే నీకు సంతోషము కలుగుతుంది. ఈ సంతోషము ఎంతకాలముంటున్నది? నీకు మరల ఆకలి కలగనంతవరకు ఉంటున్నది. ఆకలి కలగగానే సంతోషము పోతుంది మరల తినగానే సంతోషము వస్తుంది. కాబట్టి ఈ సంతోషమనేది పోవటం, రావటం జరుగుతుంది. కనుక దీనిని తాత్కాలికము అన్నారు. కాని ఆనందమనేది శాశ్వతము.

## మానవత్వము దివ్యత్వములో ఇమిడియుంటున్నది

శరీరానికి కుడిఎడమలు అనగా రైటు, లెఫ్ట్ అను విధములుగా వుంటున్నవి. అనగా రైటును ఫాలో అవ్వాలి, లెఫ్ట్‌ను విడిచిపెట్టాలి. అందుకోసమనే రామదాసు చెప్పాడు. 'అడుగు దాటనివ్వను, నా రెండు చేతులను ఒక్కటిగా చేశాను. ఇందులో రైటులెఫ్ట్‌లు లేవు. నా గుణములను ఏకము చేశాను'. రామదాసు అనేక పాటలను రాశాడు. స్వామీ! నేను ఏది హృదయముతో చేశానో, ఏది హృదయములేక చేశానో తెలియదు. ఒక్కొక్కతూరి నా



srisathyasaivachanamrutam

మనసంతా అందులో లీనమైపోతున్నాది. ఒక్కొక్కతూరి అనేక విధములుగా మనస్సు పరిగెత్తుతూ ఉంటుండాది. కాబట్టి ఈ పిచ్చికోతివంటి మనస్సును నీవే తీసుకొని నాకు శాంతిని ప్రసాదించుమ'ని కోరి వ్రాసిన పుస్తకములన్నీ కట్టకట్టి గోదావరిలో వేశాడు. కొన్ని మునిగిపోయినవి, కొన్ని తేలిపోయినవి. మునిగిపోయినవి నావి అనగా లోకమునకు సంబంధించినవి. తేలినవి మాత్రమే ఈశ్వరానుగ్రహమనుకొని తీసుకున్నాడు. భగవంతుని చర్యలు ఎవ్వరూకూడను అర్థము చేసుకొనలేరు. సూరదాసు భగవంతుని తత్త్వము తెలుసుకోవడం అసాధ్యమనుకున్నాడు. అప్పుడు ఈ విధముగా వాపోయాడు:

**నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి ఘననీయుడవు**
**ఎనుబదినాలుగు లక్షల జీవముల**
**అనయమ్మును నెడబాయకుందువట**
**అణురేణు తృణకాష్టము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుచుందువట**
**ఘనమగు దొంగలలో గజదొంగవు**
**నిను కనుగొనగలమా కృష్ణా!**

ఎందుకనగా దొంగలంతా బయటి వస్తువులను మాత్రమే దొంగలిస్తారు. కాని నీవు హృదయములో భద్రపరచుకున్నవాటినికూడా దొంగిలిస్తావు. 'చిత్తచోరా యశోదా కే బాల్ నవనీత చోర గోపాల్' అని ఈ విధముగా కృష్ణుని వేడుకున్నాడు.

అంతర్ జగత్తునకు బాహ్యాజగత్తుకు అవినాభావసంబంధమున్నదని ప్రతి వ్యక్తికూడను గుర్తించవలసిన విషయము. ఇందులో మానవత్వమనేటువంటిది, దివ్యత్వమనేటువంటిది భిన్నస్వరూపములుకావు. అందాన్ని చూచి ఆనందించేది, ఆహారాన్నిచూసి అస్వాదించేది, బయటి వస్తువులను చూసి పరవసించేది దేహమా లేక ఆత్మనా? మానవుడు ఈ రెండు విషయములను తప్పనిసరిగా విచారించవలసినదే!

sri sathyasaivachanamrutam

ఇందులో మానవత్వమనేటువంటిది దివ్యత్వములోనే యిమిడి యుంటున్నది. బాహ్యజగత్తుకు మూలము, అంతర్జగత్తుకు ఆది అయినదే ఆత్మతత్త్వము. ఇట్టి ఆత్మతత్త్వాన్ని మానవుడు విస్మరిస్తున్నాడు. అయితే భౌతిక శరీరము మనసునకు ఒక కవచములాంటిది. కేవలం పాంచభౌతికమైన దేహమే సర్వస్వంగా, జగత్తునకు ఆధారముగా భావించి అనుసరిస్తూ వస్తున్నాడు. ఇది చాలా అజ్ఞానము.

**మానవునకు సాధన అవసరం**

మనస్సుయొక్క తత్త్వము దేహమునుండి ఆవిర్భవించింది. దేహము అన్నమయము. అన్నమయమునుండి ప్రాణమయకోశమునందు ప్రవేశిస్తుంది. ప్రాణమయకోశము మనోమయకోశములో చేరిపోతున్నాది. మానవుడు భుజించే ఆహారము మూడు విధములుగా మారిపోతున్నది. స్థూలరూపమైన పదార్థము మలరూపములో విసర్జిస్తున్నాడు. సూక్ష్మరూపమైన అహారము కండలుగా మారిపోతున్నది. అతిసూక్ష్మమైన అహారము మనస్సుగా మారిపోతున్నది. అదే విధముగా త్రాగే నీరు స్థూలముగా మూత్రరూపములో పోతున్నది. సూక్ష్మరూపమైనది రక్తముగా మారుతున్నది. అతిసూక్ష్మరూపమైనది ప్రాణముగా మారుతున్నది. మానవుడు తీసుకున్న ఆహారము, నీరు ప్రాణమయ, మనోమయ రూపములను ధరిస్తున్నవి. దేహము పాంచభౌతికము. నీటిబుడగవంటిది. అనిత్యము అశాశ్వతము అయినటువంటిది. పుట్టడం, పెరగడం, పోషించటం, అభివృద్ధి నొందడం, క్షీణించడం, నశించటంవంటి షడ్వికారములు కలిగినటువంటిది. ఈ షడ్వికారమైన దేహమునుండి ఆవిర్భవించినటువంటి ప్రాణము, మనస్సుకూడను షడ్వికారస్వరూపములే! ఏ విధముగా దేహము అనిత్యమో, అదే విధముగా ప్రాణమూ అనిత్యమే! మనస్సు మరింత అనిత్యమైనటువంటిది. మనస్సు క్షణభంగురమైనటువంటిది, క్షణక్షణమునకు చలించేది. కాంతివేగముకంటే అతివేగిరముగా పరిగెత్తేటువంటిది. కాబట్టి, మనస్సుయొక్క పరుగును నియంత్రించడం ఎవ్వరివల్ల సాధ్యముకాదు. జగత్తంతయు ఈ మనస్సు ఆవరించియున్నది. ఇట్టి పవిత్రమైన మనస్సును విజ్ఞానమయముగా మార్చుకోవటానికి ప్రయత్నించటమే సరియైన విద్య.

sri sathyasai vachanamrutam

కారణం, ఈ మనస్సే మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకునేటువంటి శక్తి కలిగివుంటున్నాది. మానవునకు సాధన అవసరం. 'సాధనమున పనులు సమకూరు ధరలోన'. Practise makes a man perfect. ఈ సాధనలో ఏది సులభమైన మార్గము? కర్మమార్గము, జ్ఞానమార్గము, యోగమార్గము ఇవన్నింటియొక్క సారము భక్తిమార్గము. భక్తిలోనే సర్వ సద్గుణములు యిమిడియుంటున్నవి.

**విశ్వాసమే మానవత్వమునకు పునాది**

ధ్యానమంటే ఏమిటి? Concentration is Meditation అంటారు. కాదు కాదు. Concentration is a way of life. concentration లేకుండా మనము ఏ పని చేయలేము. రోడ్డుమీద నడవాలంటే ఏకాగ్రత అవసరము, కారు డ్రైవు చేయాలంటే ఏకాగ్రత అవసరము, లేదంటే యాక్సిడెంట్ అవుతుంది. Concentration is below the senses. ఇది ఏ విధముగా వుంటుండాది? ఒక చిన్న ఉదాహరణము. ఒక జాబును చదువుతున్నాము లేదా జాబును వ్రాస్తున్నాము. ఈ వ్రాసి, చదివే సమయములో ఎన్ని sensesని ఉపయోగపెడుతున్నాము? చేతితో పేపరును పట్టుకుంటున్నాము. కంటితో చూస్తున్నాము. ఇంకొక చేతితో వ్రాస్తున్నాము. మనస్సుతో యోచిస్తున్నాము. బుద్ధితో విచారణ చేస్తున్నాము. ఈ senses అయినటువంటి కళ్ళు, చేతులు, మనస్సు, బుద్ధి ఇవన్నీ ఉపయోగపెట్టి, concentration చేసినప్పుడే ఆ లెటరును పూర్తిచేయగలుగుతున్నాము. కాబట్టి concentration is below the senses, meditation is beyond the senses. ఈ రెండింటికిమధ్య ఒక బోర్డర్ వున్నది. ఆ బోర్డరే contemplation. ఈ concentration నుండి contemplation లోకి ప్రవేశించి, contemplation నుండి meditation లోనికి చేరుకోవాలి. గంటసేపు కూర్చుంటున్నాము కాని మనసు నిలిచింది ఎన్ని సెకన్లు? మనస్సును నిలకడగా పెట్టలేకుండా కూర్చుని టైమును వృధా చేస్తున్నాం. కాబట్టి యీనాడు చేస్తున్న ధ్యానము సరియైన ధ్యానముకాదు. Dont waste time. Time waste is life waste. కాబట్టి మనస్సును అరికట్టడానికి వెచ్చించే కాలమును నీవు వృధా చేయకుండా పవిత్రమైన కర్మలను చెయ్యి. ఏమిటి

sri sathyasaivachanamrutam

పవిత్రమైన కర్మలంటే? Goodwork is God's work. Work is worship. దీనినే వేదాంతమునందు 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అన్నారు. నీ సంతృప్తియే నిజమైన దైవత్వము. కాబట్టి దైవత్వము పొందాలంటే ముందు self confidence వుండాలి. అప్పుడే self satisfaction వస్తుంది. ఈ self satisfaction వచ్చినప్పుడు self sacrifice రావాలి. అప్పుడే self realisation వస్తుంది. కాబట్టి మనము ముందు విశ్వాసము పెంచుకోవాలి. ఈ విశ్వాసమే మానవత్వములో ప్రధానమైన దైవత్వము. విశ్వాసములేకుండా ఏ పనికూడను చేయలేము. కాని, దేనిపైన విశ్వాసము పెట్టాలో దానిమీద పెట్టడంలేదు. దీనికి కారణము మనస్సే!

**(తేదీ 03-05-1988న త్రయి బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam